


వాకాడు తహశీల్దార్ శ్రీనివాసులు మృతి



ప్రజాశక్తి - వాకాడు

తహశీల్దార్‌గా పనిచేస్తూ అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లిన జి.శ్రీనివాసులు (56) శుక్రవారం ఉదయం ఐదు గంటలకు నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌లోని తన స్వగృహంలో మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన వాకాడు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ 2022, ఆగస్టులో తన కుమార్తె వివాహం తరువాత అనారోగ్య కారణంతో సెలవు తీసుకున్నారు. మరలా తిరిగి విధులకు హాజరుకాలేకపోయారు. వాకాడు ప్రస్తుత తహశీల్దార్ ఎస్వీ నరసింహారావు, డిటి సారంగపాణి, వాకాడు మండల రెవెన్యూ సిబ్బంది జి.శ్రీనివాసులు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జి.శ్రీనివాసులు గతంలో నాయుడుపేట, చిట్టమూరు, దొరవారిసత్రం మండలాల్లోనూ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.

సిఆర్ఎస్ పారిశుధ్య కార్మికుల పోరాట విజయం

రేణిగుంట : సిఆర్ఎస్‌లో పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల పోరాటం ఫలించింది. కొత్త కాంట్రాక్టు వచ్చిన తరువాత 25 మంది పారిశుధ్య కార్మికులను పనిలోనుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో వారు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గేటు దగ్గర ధర్నాలు చేసి వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి కార్మికులను పనిలో చేర్చుకున్నారు. విజయవాడ నుంచి రైల్వే కాంట్రాక్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వారికి సిఐటియు మండల కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. పోరాటానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిన మజ్దూర్ యూనియన్ నాయకులు సురేంద్రరెడ్డి, ఎర్రబాబు, సంగ్ నాయకులు శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం, మునిరాజా, లక్ష్మి, కాంట్రాక్టర్ సురేష్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి కమిషనర్‌గా ఎన్.మౌర్య

వచ్చే వారం బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నంద్యాల జిల్లా జేసిగా పనిచేస్తున్న నారపురెడ్డి మౌర్య రానున్నారు. వచ్చేవారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన అనుపమ అంజలి ఈనెల 9తేది వరకు సెలవులో ఉన్నారు. నేటితో ఆమె కమిషనర్‌గా జాయిన్ అయ్యి ఏడాది పూర్తవుతుంది. తనకు డిప్యూటేషన్ కింద మార్చాలని అనుపమ అంజలి కోరడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త కమిషనర్‌గా ఐఎఎస్ అధికారి అయిన నారపురెడ్డి మౌర్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ అనుపమ అంజలి ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అమె హయాంలో తిరుపతి ట్రాఫిక్ సమస్య నివరణకు ఆరు నూతన మాస్టర్‌ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేశారు. అందులో మూడు రోడ్లు పూర్తి చేశారు. మరో మూడురోడ్లు ఈనెలలో ప్రారంభించనున్నారు. అనుపమ అంజలి హయంలో కొత్త కార్పొరేషన్ కార్యాలయం పనులు జరుగుతున్నాయి. రాష్ట్రపతి చేతులమీదుగా తిరుపతికి ప్రెసిడెంట్ అవార్డు తీసుకున్నారు.

నూతన కమిషనర్ నారపురెడ్డి మౌర్య సొంత గ్రామం చాపాడు మండలంలోని నాగులపల్లె. ఆమె తల్లిదండ్రులు నారపురెడ్డి చంద్రఓబుళరెడ్డి, జయశ్రీ. వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. మౌర్య భర్త సత్యనారాయణరెడ్డి సొంత గ్రామం కడపలోని చిన్నచౌకు. ఆయన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మౌర్య 2018 బ్యాచ్ ఐఎఎస్ అధికారిణి. నంద్యాలజిల్లాలో మంచి పేరుతెచ్చుకున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా రెండవసారి మహిళ ఐఎఎస్ అధికారిణిని నియమించడం విశేషం

అన్నప్రసాదాల తయారీకి మిల్లర్ల నుంచి బియ్యం సేకరణ

డయల్ యువర్ ఈవోలో ఎవి.ధర్మారెడ్డి



ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలోని మాతశ్రీ వెంగమాంబ భవనంలో భక్తులకు అందించే అన్నప్రసాదాల నాణ్యత మరింత పెంచడానికి గతంలో లాగే మిల్లర్ల నుంచి బియ్యం సేకరించాలని ఆలోచిస్తున్నామని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి చెప్పారు. ప్రస్తుతం టెండర్ల ద్వారా బియ్యం సేకరిస్తున్నామని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో 31 మంది భక్తులతో మాట్లాడారు. వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం విశేషంగా విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ఏప్రిల్ 15 నుండి జూలై 15వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విఐపి బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లను టిటిడి బోర్డు తగ్గించింది. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించడం కోసమే ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తిరుమలలో దాదాపు 7400 గదులు, 4 పిఏసిలు ఉన్నాయి. వీటిలో 40 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉంది. దాదాపు 85 శాతం గదులు సామాన్య భక్తుల కోసమే కేటాయిస్తున్నాం. తిరుమలలో ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకున్న వారు స్వయంగా వచ్చి ఏఆర్‌పి కౌంటర్‌లో స్కానింగ్ చేసుకోవాలి. వారికి గది కేటాయించినట్టుగా మెసేజ్ వచ్చిన తర్వాత సంబంధిత సబ్ ఆఫీసుకు వెళ్లి గదులు పొందాలి. ఇతరులు ఎవరు వచ్చినా గదులు పొందలేరు. నిర్ణీత సమయం(రెండు గంటల) లోపు సంబంధిత భక్తుడు గది తీసుకోకపోతే కాలపరిమితి ముగుస్తుంది. గదికి చెల్లించిన అద్దె తిరిగి ఇవ్వబడదు. కాషన్ డిపాజిట్ మాత్రమే తిరిగి చెల్లించడం జరుగుతుంది. గదుల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలను దృష్టిలో ఉంచుకుని, మధ్యవర్తులను, దళారీలను కట్టడి చేసి భక్తులకు గదులు అందుబాటులో ఉంచేందుకు వీలుగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్చి నెల వివరాలు :

శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య- 20.57 లక్షలు.
హుండీ కానుకలు - రూ.120.29 కోట్లు.
విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య - 1.02 కోట్లు.
అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య - 38.17 లక్షలు.
తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య - 8.25 లక్షలు.

పేదలకు అన్నదానం


ప్రజాశక్తి-తిరుపతిటౌన్

కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ బలిజ జెఏసి కార్యదర్శి ఆళ్వారు మురళి ఆధ్వర్యంలో బలిజ జెఏసి అధ్యక్షులు నీలం బాలాజీ పుట్టినరోజు సందర్భంగా తిరుపతి మెటర్నిటీ హాస్పిటల్ నందు గల 300 మంది పేదలకు అల్పాహారం వితరణ చేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ నీలం బాలాజీ బలిజ కులఅభివద్ధి కోసం ఎన్నో సేవలు చేసారని, వారు ఎల్లప్పుడు వారి కుటుంబం చల్లగా ఉండాలని కోరారు. తరువాత ఆళ్వారు మురళి మాట్లాడుతూ నీలం బాలాజీ రాజకీయంగా ఎన్నో ఉన్నత పదవులు అలంకరించాలని, బలిజల కోసం ఇంకా అయన సేవలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్వారు రవీంద్ర, కేశంశెట్టి రవి, శంకరప్ప, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.20 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

జంషెడ్‌పూర్‌కు చెందిన సర్ లాల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.20 లక్షలు విరాళం అందించింది. ఆ సంస్థ తరఫున ప్రతినిధి వై.రాఘవేంద్ర ఈ మేరకు విరాళం చెక్కులను శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు.





శ్రీకాళహస్తి మండలంలో



తిరుపతిలో



వడమాలపేట మండలంలో..

చెప్పారంటే... చేస్తాడంతే..!

'మా నమ్మకం నువ్వే జగన్' ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ , యంత్రాంగం

'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పారంటే... చేస్తాడంతే' అని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. శుక్రవారం తిరుపతి 27వ డివిజన్‌లో మల్లయ్యగుంట ప్రాంతంలో ఇంటింటికి వెళుతూ సంక్షేమ కార్యక్రమాలు, నగర అభివృద్ధిపై సంతృప్తిగా ఉన్నారా అంటూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రతి ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికించాలని కోరారు. అనంతరం మీడియాతో మేయర్ మాట్లాడుతూ 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నేటినుంచి ప్రారంభించామని, 14 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులకు జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. చెప్పాడంటే చేస్తాడని, మాట మీద నిలబడే వ్యక్తని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరణియాదవ్, తులసియాదవ్, ఈతమాకుల సురేష్, చింత రమేష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి/ రూరల్ : జగనన్న పాలనపై అందరికీ నమ్మకం ఉదని, ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు.కాపుగున్నేరి గ్రామంలో శుక్రవారం ఎంఎల్ఎ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల అనుమతితోనే మొబైల్, డోర్ స్టిక్కర్లు వేస్తున్నామని చెప్పారు.కార్యకర్తలు, అభిమానుల గుమ్మాలకే స్టిక్కర్లు వేస్తూ కార్యక్రమం సాగింది.

నాయుడుపేటలో.. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు నిరంతరం ప్రజల్లో ఉండాలని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. డిఎస్ఆర్ కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్లు ఈ కార్యక్రమాన్ని 20వ తేదీ వరకూ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపిపి కురుగుండ్ల ధనలక్ష్మి, ఎంపిపి అనీల్‌రెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్.. వడమాలపేట మండలం పూడి గ్రామంలో రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని కోటి 60 లోల కుటుంబాల్లో దాదాపు ఐదు కోట్ల మంది ప్రజలను 14 రోజుల్లో కలిసి జగనన్నకు ప్రజల్లో ఉన్న అభిమానాన్ని వెల్లడిస్తామన్నారు. ఎంపిపి విజయలక్ష్మి, వైస్ ఎంపిపిలు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో..

బిఎన్ కండ్రిగలో... లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో జేసీఎస్ కన్వీనర్ వై.జయచంద్రనాయుడు, ఎంపిపి సుబ్బలక్ష్మి ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నాలుగేళ్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లోనూ 175 సీట్లు ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బాబురెడ్డి, మునెమ్మ, రమణయ్య, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శులు జె.గోపాల్‌రెడ్డి, ఉగ్గుముడి గురునాథం పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ సజీవ దహనం కేసులో...

ఐదుగురు సూత్రదారులు

నలుగురు అరెస్టు, పరారీలో ఒకరు
వివాహేతర సంబంధమే కారణం : ఎఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

సాఫ్ట్‌వేర్ సజీవ దహనం కేసులో వివాహేతర సంబంధమే ప్రధాన కారణమని, హత్యకు ఐదుగురు కీలకంగా వ్యవహరించారని ఎఎస్‌పి వెంకట్రావ్ వెల్లడించారు. ఎ1 బి.రిపంజయ, ఎ2 చాణిక్య ప్రతాప్, ఎ3. పేట గోపీనాథ్‌రెడ్డి, ఎ4.అప్పా రమేష్, ఎ5 అప్పా కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చాణిక్య ప్రతాప్ పరారీలో ఉండడంతో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈనెల ఒకటో తేదీ జరిగిన సాఫ్ట్‌వేర్ హత్యను చంద్రగిరి పోలీసులు చేదించారు. గురువారం సాయంత్రం రేకలచెరువు అనుప్పల్లి వద్ద ముద్దాయిలను అరెస్టు చేసి రౌడీషీట్ ఓపెన్ చేశారు. పథకం ప్రకారం హత్య చేయడమే గాక, మరో మూడు వాహనాలను హత్యకు ఉపయోగించారు. చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో ఎఎస్‌పి వెంకట్రావు మీడియాకు వివరాలను వెల్లడించారు.

చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో సోంపల్లి జయరామయ్యకు ఇద్దరు కొడుకులు నాగరాజు, పురుషోత్తం. ఇద్దరూ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగులుగా జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బలిజ కులానికి చెందిన బట్టే రిపంజయ (40), అతని అన్న బట్టే చాణిక్య ప్రతాప్ ఉన్నారు. రిపంజయ భార్య శిరీష సర్పంచిగా ఉన్నారు. జయరామయ్య చిన్న కొడుకు పురుషోత్తంకు రిపంజయ సతీమణితో వివాహేతర సంబంధం ఉండడంతో ఇటీవల ఇరు కుటుంబాల మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి. ఈ తరుణంలో పురుషోత్తంను ఎలాగైనా చంపాలని రిపంజయ ప్రయత్నిస్తున్నాడని గుర్తించి పురుషోత్తంను గ్రామంలో లేకుండా బెంగుళూరుకు పంపారు. అన్న నాగరాజు అనేక రకాలుగా రిపంజయతో సంధి కుదుర్చుకోవాలని ప్రయత్నించాడు. అంతేకాకుండా నాగరాజు రిపంజయకు ఫోన్ చేసి అతనితో అసభ్యంగా మాట్లాడి, ఆ సంభాషణను ఫోన్లో రికార్డు చేసి గ్రామంలో తెలిసిన అందరికీ వినిపించడంతో రిపంజయకు అవమానంగా అనిపించింది. తమ కుటుంబ పరువు తీస్తున్నాడని నాగరాజుపై తీవ్ర కోపాన్ని పెంచుకున్నాడు. రిపంజయ ఈ విషయాన్ని అన్న చాణిక్య ప్రతాప్‌కు తెలియజేసి పథకం ప్రకారం వారిని హత్య చేయించాలని నాగరాజుకు తెలిసిన గోపీనాథ్‌రెడ్డి సాయంతో 'రాజీ' పేరుతో చంద్రగిరికి పిలిపించారు. వారి బంధువులైన బొప్పరాజుపల్లికి చెందిన అన్నదమ్ములు రమేష్, కుమార్ సాయంతో నాగరాజుకు అధిక మోతాదులో మద్యం తాగించి పథకం ప్రకారం బొప్పరాజుపల్లి వద్ద చెట్టుకింద ఊపిరాడకుండా ముక్కు నోరు అదిమి హత్య చేశారు. తరువాత శవాన్ని కారు లోపల ముందు భాగంలో ఉన్న సీటులో పడేసి వారి వెంట తెచ్చుకున్న పెట్రోల్ సాయంతో కారు లోపల, పైన పోసి మంటపెట్టి కారును వాగులోకి తోసేయడానికి ప్రయత్నించారు. ప్రమాదవశాత్తు జరిగినట్లుగా సృష్టించే ప్రయత్నం చేసినా, చంద్రగిరి పోలీసులు హత్యేనని తేల్చి నిందితులను వారం రోజుల్లోనే అదుపులోకి తీసుకున్నారు.



ఆక్రమణల తొలగింపులో రాజీ ప్రసక్తే లేదు : ఆర్డీవో

ప్రజాశక్తి - కోట

కోట పట్టణంలో దశాబ్దాల కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న కోట ఆక్రమణల తొలగింపులో రాజీ ప్రసక్తే లేదని, సర్వే మార్కింగ్ ఎంతవరకూ ఉందో అంతవరకూ పూర్తిస్థాయిలో ఆక్రమణలను త్వరలోనే తొలగిస్తామని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు కోట ఆక్రమణల తొలగింపుకు సంబంధించి ఎంఎల్ఎ వెలగపల్లి వరప్రసాదరావు, వాకాడు సిఐ హరికృష్ణ, వైసిపి నేత నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఒ భవాని, సర్వేయర్లు హరోహర్, గోపి, ఆర్ అండ్ బి డిఇ అరుణకుమారిలతో కోట క్రాస్ రోడ్డునుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు పరిశీలించారు. వీరితో పాటు వందలాదిమంది వ్యాపారులు నడిచి వచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వెలగపల్లి వరప్రసాద్‌రావు మాట్లాడుతూ కోటలో ఆక్రమణల తొలగింపుపై సర్వే జరిపి మార్కింగ్ వేశారని, ఎవరి దుకాణాలు ఎంత మేర పోయాయో మ్యాప్ వేసి తరువాత నిధులు మంజూరు చేయించుకుని డ్రైనేజీ కాల్వలు కట్టుకోవాలన్నారు. కలెక్టర్‌తో చర్చించి తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఎంఎల్ఎ తీరుపై ప్రజలు ధ్వజమెత్తారు. నాలుగేళ్లలో కోట గ్రామానికి ఏం చేశావంటూ ప్రశ్నించారు. వైసిపి నేత నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి సైతం ఎంఎల్ఎ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆక్రమణల తొలగింపులో కాలయాపన తగదని, ముందు ఆక్రమణలను తొలగించాలన్నారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కోట గ్రామ మహిళలు కోటలో 4 ఎకరాల 60 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణల్లో ఉందని, ఈ భూమిని స్వాధీనం చేసుకుని ఇంటి స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. మైక్రోటవర్ వద్ద జగనన్న లేఔట్‌లో ఇంటి నివేశన స్థలాలు ఇచ్చారని, అది కోట నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉందని, అది రద్దు చేసి, కోటలోనే ఇంటి స్థలాలివ్వాలని కోరారు. పల్లమాల తూపిలిపాళెం రోడ్డు మంజూరు కావడంతో ఆక్రమణలు తొలగించాలని ఆర్డీవో ఆదేశించారు. కోట ఆక్రమణలకు సంబంధించి మ్యాప్ ద్వారా ఆక్రమణల జాబితా వారికి, వ్యాపారస్తులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. దాదారాయిగుంట స్థలంలో నూతన నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును ఆదేశించారు.



ఎంఎల్ఎను ప్రశ్నిస్తున్న వైసిపి నాయకుడు వినోద్‌రెడ్డి



తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సమావేశం

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం: ఐఎంఎ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఏ జాతీయ నాయకులు డాక్టరు దగ్గుమాటి శ్రీహరిరావు తెలిపారు. ఐఎంఏ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు ఎస్‌విఎంసి నుంచి మారథాన్ నిర్వహించారు. అనంతరం 10 గంటలకు ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని రాస్ బిల్డింగ్‌లో పలు రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒకరు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. మారుతున్న వాతావరణం, ఆహారపు అలవాట్ల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, మదుమేహం, బిపి, అల్సర్ వంటి సమస్యలపై అలసత్వం ప్రదర్శించకుండా అవగాహన పెంచుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువుర్ని సత్కరించారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళీ, డిఎంహెచ్‌వో డాక్టరు శ్రీహరి, తుడా కార్యదర్శి లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి, ఏపి ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టరు హరికృష్ణ, బిజెపి నాయకులు అజయ్‌కుమార్, జనసేన నాయకులు డాక్టరు బాబు, డాక్టరు సునీత, వే పౌండేషణ్ అధ్యక్షులు పైడి అంజయ్య, ఐఎంఏ నాయకులు డాక్టరు యుగంధర్, డాక్టరు రాజా రమణి, డాక్టరు సునీత పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సిఐటియు నాయకులు కందారపు మురళి

సంతకాల సేకరణ

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. ఆరోగ్యం ప్రజల హక్కుగా ప్రభుత్వం ప్రకటించాలని , బడ్జెట్లో 5 శాతం ఆరోగ్యానికి కేటాయింపు చేయాలని, మందులు , మందుల పరికరాల మీద జీఎస్‌టి తొలగించాలని ప్రజల దగ్గర సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి.రామక్రిష్ణ , నాయకులు యస్. రవింద్రారెడ్డి, యస్. రాజేష్ పాల్గొన్నారు.



'వాక్‌థాన్'ను ప్రారంభించిన డిఎంహెచ్‌వో

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వాక్‌థాన్‌ను డిఎంహెచ్‌వో డాక్టరు యు.శ్రీహరి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర 2 కిలోమీటర్ల వరకు కొనసాగి, ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, గుండెజబ్బులు, మధుమేహం, క్యాన్సర్, ఇతర వ్యాధులను నివారించడం, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి వాక్‌థాన్ నిర్వహించిందని తెలిపారు. ఆస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టరు శ్రీధర్‌ముని, డాక్టరు సునందకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని పుత్తూరు సీనియర్ న్యాయవాది ఎన్ మురుగేష్‌రెడ్డి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పుత్తూరు ప్రభుత్వాసుపత్రిలో పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యంగా ఉండాలని.. ముఖ్యంగా వ్యాయామం చేయాలని సూచించారు. దేశ అభివద్ధిలో ఆరోగ్యమైన ప్రజలు కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. డాక్టర్ జ్యోతి నిర్మల మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలను పీడిస్తున్న మధుమేహం అధిక రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవడానికి జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అందని రేషన్ బియ్యం..!

- మూడునెలలుగా దళితుల అవస్థలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మండలంలోని తడుకు సచివాలయం పరిధిలోని ఎగువగుళూరు దళితవాడలో గత మూడు నెలలుగా రేషన్ బియ్యం అందకుండా అవస్థలు పడుతున్నారని దళిత ఎస్సీ,ఎస్టీ జిల్లా కార్యదర్శి వై నందయ్య శుక్రవారం ఓ ప్రకటనలో వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, వద్ధులు, మహిళలు, పేద కుటుంబాలు ఆకలితో అవస్థలు పడుతున్నారని.. ఉచితంగా..కిలో రూపాయికి అందే బియ్యాన్ని బయట వారి నుంచి కొనుగోలు చేసుకుని తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా ఎగువగూళూరు దళితవడకు బియ్యం పంపిణీ చేస్తే వాహనం రావడం లేదు.. దీంతో ప్రభుత్వం అందించే నిత్యావసరాలు అందడం లేదన్నారు. ఎగువగూళూరులో 165 రేషన్ కార్డులు ఉన్నాయని.. 580 మందికిపైగా జనాభా కలిగిన గ్రామంలో చౌకబియ్యం అందించకపోవడం దారుణమని వాపోయారు. పుత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో సమస్యను విన్నవించినా పట్టించుకోకపోవడంతో గ్రామంలో ఆకలి కేకలు తప్పడం లేదని.. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

డంపింగ్ యార్డును తొలగించాలని నిరసన



ప్రజాశక్తి-తిరుచానూరు: స్వర్ణముఖి నది పక్కన డంపింగ్ యార్డు నిల్వ చేసి పంచాయతీ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని జనసేన నాయకులు వెంకట్ రాయల్ స్థానికులతో కలసి నిరసనకు దిగారు. నదులకు పక్కన డంపింగ్ యార్డు ఉండరాదని సెంట్రల్ పొల్యూషన్ బోర్డు చెబుతున్నా పట్టించుకోకుండా పంచాయతీ డంపింగ్ నిల్వలను నది పక్కన వేయడం సమంజసం కాదన్నారు. స్వర్ణముఖి నది పక్కన ఉన్న డంపింగ్ యార్డు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని.. కలెక్టర్ దృష్టికి తీసుకెళుతామని హెచ్చరించారు.

వైభవంగా రథోత్సవం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని కోనేటిమిట్టలో వెలసిన శ్రీ కోదండ రామాంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ పుర వీధుల్లో రథోత్సవం వైభవంగా సాగింది. ఆలయ కమిటీ ఛైర్మన్, వైసీపీ గూడూరు నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు తాళ్లూరు శ్రీనివాసులు, ఆలయ దేవస్థాన కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని చిన్న సింగమలలోని ఓ ప్రైవేటు మందుల దుకాణంలో జరిగిన ఘర్షణకు సంబంధించి నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ మల్లికార్జున, ఎస్సై మహేష్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెళ్లకూరు మండలం కలవగుంట గ్రామానికి చెందిన లక్ష్మయ్య కుమారుడు వెంకటేష్(24) ఆర్‌ఎంపీ వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో ఇతను పెద్దకన్నలి గ్రామంలో ఓ ప్రైవేటు మెడికల్ ప్రాక్టీస్ చేసేవాడు. ఇదే గ్రామంలో బీటెక్ చదువుతున్న హేమచంద్రతో సింగంమాల గ్రామంలో రోడ్డు పక్కనే మెడికల్ దుకాణం నిర్వహించేవాడు. హేమచంద్ర నిర్వహిస్తున్న మెడికల్ షాపులో ఆర్.ఎం.పి వైద్యుడిగా సేవలు అందిస్తున్న వెంకటేష్ ఇటీవల కోచింగ్ కోసం నంద్యాలకు వెళ్లాడు. దీంతో మెడికల్ షాపును తన అన్న లీలా ప్రసాద్‌ను చూసుకోమని చెప్పి వెళ్లాడు. అయితే లీలాప్రసాద్ డ్యూటీకి వెళ్లిన సమయంలో భార్యను చూసుకోమని చెప్పేవాడు. దీంతో భార్య దుకాణంలో ఉండగా ఆమెతో ఆర్‌ఎంపీ వైద్యుడు అసభ్యంగా ప్రవర్తించడంతో విషయం తెలుసుకున్న హేమచంద్ర వెంకటేషను ప్రశ్నించాడు. వీరిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకటేష్ హేమచంద్రను బయటకు తీసుకొచ్చి కత్తితో తలపై నరకడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ కేసులో పరారీలో ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకటేష్ ను శుక్రవారం బైపాస్ రోడ్డులో ఉన్న ఏపీ సీడ్స్ కూడలి వద్ద ఉండగా అదుపులోకి తీసుకొని రిమాండుకు పంపారు. నిందితుడిని అదుపులో తీసుకోవడంలో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ పూర్ణ, శ్రీనివాసులు , కానిస్టేబుల్ శ్రీనులను సీఐ అభినందించారు.

కారు ఢీకొని ఇద్దరి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట మండలం పిల్లపాలెం గ్రామానికి చెందిన వెంకటముని(52), ప్రసాద్(53) శుక్రవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వస్తుండగా గ్రామ సమీపంలోని మలుపు వద్ద కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరిని ఆసుపత్రికి తరలించే లోపు ఇద్దరూ మృతిచెందారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి విచారిస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -తొట్టంబేడు: రాజీవ్‌నగర్ సమీపంలోని ఓ ఇంట్లో మద్యం విక్రయిస్తున్న మునికృష్ణ(48) అనే వ్యక్తిని తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర శుక్రవారం అరెస్టు చేశారు. అతని నుంచి 34 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అనాథలకు అండ.. వాత్సల్య

- తల్లిదండ్రులు లేని పిల్లలకు ఆసరా
- నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బాలాయపల్లి, బుచ్చినాయుడుకండ్రిగ

తల్లి లేకున్నా.. తండ్రి లేకున్నా.. ఇద్దరూ లేని పిల్లలకు ఆసరాగా నిలుస్తోంది మిషన్ వాత్సల్య పథకం. ఈ పథకంతో ఆర్థిక సాయం ప్రతినెలా ఆర్థిక సాయం అందుతుంది. ఏడాది నుంచి 18 సంవత్సరాలు నిండిన పిల్లలకు వైద్య, విద్య, అభివద్ధి అవసరాలు తీర్చడానికి కొంత సహాయం అందించడానికి కేంద్ర ప్రాయోజిత పథకంతతో మిషన్ వాత్సల్య స్కాలర్షిప్ అందించడం జరుగుతుంది. కొన్ని షరతులతో ఈ సాయం అందనుంది. పిల్లలకు నెలకు రూ.4 వేలు అందుతుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే పట్టణ ప్రాంతాలలో కుటుంబ సంస్థ ఆదాయం రూ.96 వేలు నుంచి ఉండరాదు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రం 60 శాతం అంటే రూ.2400 కాగా.. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రూ.1600 నిధులు సమకూర్చి అనాథ పిల్లలకు అందజేయనున్నారు. ఈ పథకం నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాల పిల్లల సంరక్షణతో పాటు వారి చదువును కొనసాగించేందుకు ఉపయోగపడుతుంది.



మిషన్ వాత్సల్య పథకానికి ఎవరు అర్హులు?

నిరుపేద, నిస్సహాయ స్థితిలో అర్హతలు కలిగిన 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు అర్హులు. వితంతువు, విడాకులు తీసుకున్న కుటుంబం, తల్లి వదిలేసిన పిల్లలు, అనాథలు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న పిల్లలకు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు ఆర్థికంగా, శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సహాయ తల్లిదండ్రుల పిల్లలకు, బాల న్యాయ (రక్షణ ఆదరణ) చట్టం -2015 ప్రకారం రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లలు, ఇల్లు లేని బాలలు, ప్రకతి వైపరీత్యాలకు గురైన బాలలు, బాల కార్మికులు, బాల్య వివాహ బాధిత బాలలు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ బాధిత బాలలు, అక్రమ రవాణాకు గురైన బాలలు, అంగ వైకల్యం ఉన్న బాలలు, తప్పిపోయిన, పారిపోయిన బాలలు, వీధి బాలలు, బాల యాచకులు, హింసకు/వేధింపులకు/దుర్వినియోగం/ దోపిడీలకు గురైన బాలలు, సహాయం, ఆశ్రయం కావలసిన పిల్లలు అర్హులు.


వీరికీ వర్తిస్తుంది

తండ్రి మరణించిన.. తల్లి వితంతువుగా ఉన్నా.. విడాకులు తీసుకొని కోర్టు నుంచి పొందిన ఆదేశాలు ఉండాలి. గ్రామ పెద్దల సమక్షంలో రాసుకున్న ఒప్పంద పత్రంతో ధరఖాస్తు చెయ్యొచ్చు. కమిటీ నిర్ణయమే ఫైనల్ . కుటుంబం విడిచిపెట్టిన పిల్లలు. పిల్లలకు తల్లి, తండ్రి ఇద్దరు మరణించి అనాథులుగా ఉండి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్న వారు. తల్లిదండ్రులు ప్రాణాపాయ లేదా ప్రాణాంతక వ్యాధికి గురైన వారు,బాల కార్మికులుగా గుర్తించ బడిన పిల్లలు, కుటుంబంతో లేని పిల్లలు, అంగవైకల్యం కలిగిన పిల్లలు, ఇంటి నుండి పారిపోయి వచ్చిన పిల్లలు, బాల యాచకులు, ఏదైనా ప్రకతి వైపరీత్యానికి గురైన పిల్లలు, వీధులలో నివసిస్తున్నటువంటి పిల్లలు, దోపిడీకి గురైన పిల్లలు (జే. జే యాక్ట్ ,2015 ప్రకారం) కోవిడ్-19లో తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలు అర్హులు.

వీరికి వర్తించదు

ఈ పథకానికి అర్హులైన పిల్లలకు గ్రామీణ ప్రాంతాలలో కుటుంబ సంస్థ ఆదాయం రూ.72,000 కి మించి ఉండరాదు. రెసిడెన్సియల్ స్కూల్‌లో చదువుతున్న బాలలకు ఈ పథకం వర్తించదు. పిల్లలు 30 రోజులకు మించి స్కూలుకు హాజరు కాకుంటే సదరు స్పాన్సర్ షిప్ రద్దు చేయబడుతుంది. (ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మినహాయింపు కలదు). అర్హులైన పిల్లలు భవిష్యత్తులో ఏదైనా హాస్టల్స్‌లో జాయిన్ అయి తే అక్కడ నుంచి పథకం నిలుస్తుంది. ప్రతి సంవత్సరం ఈ పథకాన్ని సమీక్షించి స్పాన్సర్షిప్ ను నిలిపివేయవచ్చు. కొనసాగించవచ్చు. తల్లి చనిపోయి తండ్రి వేరే వివాహం చేసుకుంటే అటువంటి పిల్లలకు ఈ పథకం రాదు.

సచివాలయాల్లోనూ దరఖాస్తులు



తలీ లేకున్నా.. తండ్రి లేకున్నా.. ఇద్దరూ లేకపోయిన పిల్లల వివరాలతో ఆయా సచివాలయాల్లోని మహిళా పోలీసులను మొదట సంప్రదించాలి. వారి సాయంతో పూర్తి వివరాలను అందించి పేర్లను నమోదు చేసుకోవాలి. పథకాలనికి కావాల్సిన ధ్రువపత్రాలను మొదటగా ఉంచుకోవాలి. మహిళా పోలీసులు, అదే గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో పూర్తి ధరఖాస్తును సీడీపీవో కార్యాలయానికి పంపాలి. ఈ పథకం గ్రామీణ అనాథ పిల్లలకు ఎంతో ఉపయోగకరం. పిల్లల బాగోగులకు ఎంతగానే ఉపయోగపడుతంది. నెలకు రూ.4 వేలు అందుతుంది.

- భారతి, సూపర్‌వైజర్, పుత్తూరు

ధ్రువపత్రాలు అవసరం



చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికేట్(2022-2023) అందించాలి. బాలుడు, బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తల్లి ఆధార్ కార్డు, తండ్రి ఆధార్ కార్డు, తల్లి, తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, మరణం కారణం. గార్డియన్ ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, ఫోటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బాలుడి, బాలిక వ్యక్తిగత బ్యాంక్ ఎకౌంటు, తల్లి, తండ్రి , సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్. ఈ వివరాలతో పాటు దరఖాస్తును అందుబాటులోని సీడీపీవో కార్యాలయానికి గడువు లోపల అందించాలి.

- సంషాద్ బేగం, సీడీపీవో, వెంకటగిరి

నేర వార్తలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఆరుగురికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లా అశ్వపురం గ్రామానికి చెందిన కొప్పల శ్రీనివాసరావు కుటుంబం శుక్రవారం కారులో వెంకన్న దర్శనార్థం తిరుమలకు బయలు దేరింది. ఈ క్రమంలో మండలంలోని చెర్లోపల్లి వద్ద ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి వేగంగా ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ కోటేశ్వరరావు(39) అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస రావు, నాగమణి, యామిని, తరుణ్, ధనుష్ విష్ణులను స్థానికులు 108 లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేత విజయ్‌కుమార్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-నాగలాపురం: నాగలాపురం మాజీ ఎంపీపీ, వెండలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కల్పన భర్త విజయ్‌కుమార్ గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతిచెందారు.



ఆయన భౌతికకాయానికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. విజయ్ కుమార్ మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కోనేటి సుమన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

విజయకుమార్ సేవలు అభినందనీయం





ప్రజాశక్తి-గూడూరు టౌన్: రాష్ట్రంలో దాతత్వానికి పునాదులు వేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరుతో వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు స్థాపించి వైసీపీ నాయకులు బత్తిని విజయకుమార్ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వరప్రసాద్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకులు బత్తిని విజయకుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్, స్వచ్ఛాంధ్ర చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో గూడూరు పట్టణంలో మొట్టమొదటగా చలివేంద్రం తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, నశిన నాగులు, దాము, సురేంద్ర, సెబ్ సీఐ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో...

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండూరు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో ధర్మరాజులస్వామి గుడి ఎదురుగా ఉచిత చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. వెయ్యిమందికి మజ్జిగ, గుగ్గిళ్లు, పులిహోర పంపిణీ చేశారు. డాక్టర్ రోహిణమ్మ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మూడు నెలల పాటు నిర్విరామంగా చలివేంద్రంలో భాగంగా మినరల్ వాటర్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. డాక్టర్ రోహిణమ్మ మాట్లాడుతూ వేసవి కాలంలో మంచి కార్యక్రమాన్ని ప్రగతి సేవా సంస్థ ప్రారంభించడం సంతోషకరమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, కొండూరు హరిబాబు, ప్రగతి కుటుంబ సభ్యులు పీడీ కరీముల్లా, కార్పొరేషన్ రవికుమార్, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, టీచర్ మామడూరు రాధయ్య, ఐటిఐ ప్రభాకర్, మనపాటి శ్రీనివాసులు, కందాటి సుధ, గౌడ్ శీనయ్య, ఎక్సైజ్ దయాకర్, వాచ్ షాప్ రాము, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్, ఆర్వి కన్స్ట్రక్షన్ వెంకటకష్ణయ్య , శ్రీహరి, కుమార్ నాయుడు, నాగరాజు, కృష్ణారెడ్డి, శీను , సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రతివారం అన్నదానం

ప్రజాశక్తి -తిరుపతి అర్బన్: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లి ఆలయంలో శుక్రవారం ప్రతివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. మొదటి శుక్రవారం దాతగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ముందుకొచ్చి భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీవారి దర్శనానికి 48 గంటలు

ప్రజాశక్తి-తిరుమల: వారాంతంలో వరుస సెలవులు రావడంతో తిరుమలకు విశేషంగా భక్తులు విచ్చేశారు. ప్రస్తుతం టోకెన్ లేని భక్తులకు శ్రీవారి దర్శనం కోసం 48 గంటల సమయం పడుతోంది. ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకుని భక్తులు తమ తిరుమల యాత్ర ప్రణాళిక రూపొందించుకోవాలని కోరడమైనది.

మంచు మోహన్‌బాబును కలిసిన టీడీపీ నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి అర్బన్: ప్రముఖ సినీనటుడు ఎం.బి.యు యూనివర్సిటీ వ్యవస్థాపకులు మంచు మోహన్‌బాబును ఏ రంగంపేట తెదేపా నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ కార్యదర్శి చెంగల్‌రాయులు ఆధ్వర్యంలో మోహన్ బాబుని ఘనంగా సన్మానించారు. దేవిలాల్ , భూలక్ష్మి , వేణుగోపాల్ రెడ్డి, జ్ఞానశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎస్.ఎ.ఎల్.సి చర్చి, సార్వత్రిక ప్రార్థనా మందిరంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు, గీతాలు ఆలపించి దైవ సందేశం అందించారు.

పుత్తూరు టౌన్: గుడ్‌ఫ్రైడే పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు పుత్తూరు పట్టణంలోని ఎన్జీవో కాలనీని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ సంఘం చర్చి పాస్టర్ సెల్వం మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన కోసం కాకుండా ప్రజల కోసం సిలువ వేయబడ్డారన్నారు. సిలువలో ఏసుప్రభు మేకులతో కొట్టినప్పుడు పలికిన ఏడు మాటలను భక్తులకు తెలిపారు. మధ్యాహ్నం చిరంజీవి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.కార్యక్రమంలో విజయ్ కుమార్, మహిళలు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



తిరుపతి(మంగళం): పాప విమోచకుడు యేసు క్రీస్తు సిలువలో ప్రాణ త్యాగం చేసిన రోజును గుడ్ ఫ్రైడే గా జరుపుకుంటామని షెకీనా ప్రార్థన మందిరం పాస్టర్ అరుణ్ అరసు తెలిపారు. తిరుపతి నగర పరిధిలోని కెబి లేఅవుట్లో ఉన్న షెకీనా పార్థన మందిరంలో శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం వరకు ప్రత్యేక వాక్య బోధనలను చేశామన్నారు. ఏసుక్రీస్తు సూచించిన విధంగా శత్రువులను సైతం క్షమించాలన్న మొదటి పలుకును ధ్యానిస్తూ క్షమాగుణం అందరూ కలిగి ఉండాలన్నారు. ప్రార్థనలో జోయల్, బాబూరావు, జోసెఫ్, దయాలన్, ప్రభుకిరణ్, చరణ్ చందు, మోనికా, జెస్సీ, లక్ష్మీ మోసస్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కొర్లగుంటకు చెందిన ఆర్పీ హేమలత దేవాదాయశాఖ ఉద్యోగి వేణుగోపాల్‌తో కలిసి తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఆర్.మహేశ్వరి ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరి మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని కొర్లగుంటలో హేమలత ఆర్పీగా పనిచేస్తున్నారని, హేమలత వద్ద కొన్నేళ్లుగా సన్నిహితంగా ఉంటూ ఆమె చెప్పిన పనులు చేస్తూ ఉండేదానన్నారు. అయితే హేమలత ఇంటికి వచ్చి వెళ్లే దేవాదాయశాఖ ఉద్యోగి వేణుగోపాల్ తనకు అర్ధరాత్రుల్లో వాట్సాప్ కాల్స్ చేస్తుండటంపై అభ్యంతరం చెప్పి తిరిగి ప్రశ్నించడంతో తిరుమలలో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న తన భర్తను మనుషులను పెట్టి కొట్టించిందన్నారు. డ్వాక్రా సంఘాలలో లోన్లకు వసూలైన నగదుతో అక్రమ వడ్డీ వ్యాపారాలు చేస్తూ కొర్లగుంటలో ఓ చిన్నపాటి అక్రమ సామ్రాజ్యాన్ని స్థాపించిందన్నారు. ఇలా అక్రమ వడ్డీ వ్యాపారాలతో నేడు కోట్లకు పడగలెత్తి ఆస్తులను కూడబెట్టిందన్నారు. తాను తీసుకున్న అప్పుకు వడ్డీలు, అసలు కట్టినా ఇంకా నగదు చెల్లించాలని హేమలత గత కొంతకాలంగా వేధిస్తోందన్నారు. ఆమె వ్యవహారాలపై తాను ఎక్కడైనా నోరు విప్పుతానన్న నెపంతో ఉద్దేశపూర్వకంగా గొడవలకు లాగుతోందన్నారు. ఈమె వ్యవహారాలపై పోలీసులకు, నగరపాలక సంస్థ కమిషనర్ కు వినతులు ఇచ్చినా నేటికీ ఏ చర్యలు తీసుకోవడం లేదని, అంతటి స్థాయిలో తన వద్దనున్న డబ్బుతో అధికారులను మభ్యపెడుతోందని ఆరోపించారు. కొర్లగుంటకు చెందిన టిడిపి నాయకురాలు సత్యవతి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు సంజయ్ హేమలతకు అండగా ఉంటారని చెప్పారు. తన కుమారుడికి నాలుగేళ్ల వయసు వచ్చినా నడవలేని పరిస్థితుల్లో ఉన్నాడని, హేమలత, వేణుగోపాల్ కారణంగా తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని.. వీరిపై చర్యలు తీసుకోకపోతే తిరుపతి అర్బన్ జిల్లా పోలీసు కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు.